క్లుప్తంగా

నేడు పలు గ్రామాల్లో స్పీకర్ పర్యటన

ఆమదాలవలస రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం పర్యటించనున్నారు. రామచంద్రాపురం, పొన్నాంపేట, చిన్నజొన్నవలస గ్రామాల్లో శనివారం ఉదయం 10.30 గంటలకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయి కార్యక్రమాన్ని స్పీకర్ ప్రారంభిస్తారని మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నిమ్మతొర్లాడ గ్రామంలో మధ్యాహ్నం 3.30 గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. మండల నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

స్పందన అర్జీలు పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న జయరాజ్

సారవకోట: స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి వి.జయరాజ్ అధికారులను సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో స్పందన అర్జీలపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని.. కనుక ప్రజల నుంచి వచ్చిన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ హనుమంతరావు, ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఏపీఓ సత్యమూర్తి తదితరులున్నారు.

పైపులు కాల్చేశారని ఫిర్యాదు



కాలిబూడిదైన పైపులు

జలుమూరు: తనకు చెందిన వ్యవసాయ పైపులను కొప్పల రమణ కాల్చి బూడిద చేశాడని అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు ఫిర్యాదు చేసినట్టు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఈ నెల ఆరో తేదీ రాత్రి ఎంపీడీవో సన్మాన కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా తన బోరు షెడ్ వద్ద కొప్పల రమణ అనుమానాస్పదంగా ఉండడం గుర్తించానని.. తనను చూసి పరిగెత్తి వెళ్లిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదే వ్యక్తి గురువారం రాత్రి పైపులైన్‌కు అగ్గిపెట్టినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



నర్సునాయుడు (ఫైల్)

జలుమూరు: అందవరం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రేగాన నర్సునాయుడు (86) శుక్రవారం స్వగ్రామం రామకృష్ణాపురంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన ఎంపీటీసీ సభ్యుడుగా కూడా పని చేశారు. నర్సునాయుడు మృతి పట్ల ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ వాన గోపి, జలుమూరు జెడ్పీటీసీ సభ్యురాలు విజయశాంతి, మండల పార్టీ నాయకుడు సీతారాం, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు శ్యామలరావు, రాజప్పలనాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

స్పీకర్‌ను కలిసిన డీఈఈ



స్పీకర్‌ను కలిసిన భాస్కరరావు

ఆమదాలవలస: తూర్పుతీర విద్యుత్ పంపిణీ సంస్థ ఆమదాలవలస సర్కిల్ పరిధిలో డీఈఈగా జి.భాస్కరరావు ఇటీవల చేపట్టారు. ఈయన స్పీకర్ తమ్మినేని సీతారాంను తన క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా మెరుగైన సేవలు అందించాలని డీఈఈకి స్పీకర్ సూచించారు.

ట్రైసైకిల్ వితరణ

పాతపట్నం: స్థానిక సెంటెన్స్ ఆన్స్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాతపట్నానికి చెందిన దివ్యాంగుడు మామిడి తిరుపతిరావుకు ట్రైసైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రిన్సిలీపాల్, మాజీ ప్రిన్సిపాల్ క్రిస్టిజాన్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

హిరమండలం: మండల వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వెనుకన ఉన్న సత్యనారాయణ కల్యాణ మండపంలో జరగనున్న సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, క్రియాశీలక కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు హాజరు కావాలని కోరారు.

● అవగాహన..



మలేరియా వ్యాధి వ్యాపించకుండా అవగాహనతో వ్యవరించాలని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా రొట్టవలసలో వైద్య, సచివాలయం సిబ్బందితో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మురుగు నీరు, చెత్త ఇంటి ముందర నిల్వలేకుండా చూడాలని సూచించారు. సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి గురుగుబెల్లి రాము పాల్గొన్నారు.

\- సరుబుజ్జిలి

● భక్తిశ్రద్ధలతో..



సారవకోట మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి మందిర ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర ఆవరణలో హోమం, పంచామృతాభిషేకం, ప్రత్యేక, విశేష పూజలు, కుంకుమార్చనలను రుత్వికుడు లక్ష్మీనారాయణ శాస్త్రి చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చిన్నాల మాధవరావు, హనుమాన్ భక్తసమాజం సభ్యులు పాల్గొన్నారు.

\-సారవకోట

● సత్కారం..



కొత్తూరు మండల తహసీల్దార్‌గా పనిచేసి పలాస డివిజన్ కార్యాలయ ఏవోగా బదిలీపై వెళ్తున్న పి.బాలను స్థానిక కార్యాలయ సిబ్బంది, సర్వేయర్లు, వీఆర్వోలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. నాలుగేళ్లపాటు మండల ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నూతన తహసీల్దార్ చక్రవర్తి, కొత్తూరు తాలూకా ఎన్జీవో అధ్యక్షుడు అల్లు తిరుపతిరావు, మండల సర్వయర్ రమణయ్య, ఆర్ఐ లక్ష్మణరావు వీఆర్వోల సంఘం నాయకుడు రాజగోపాలరావు, జగపతిబాబు, సత్యనారాయణ, హరిహరరావు, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

\-కొత్తూరు

రైతులకు అండ 'వైఎస్సార్ యంత్ర సేవ'





ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభిస్తున్న కృష్ణదాస్ (ఇన్‌సెట్‌లో) ట్రాక్టర్‌ను డ్రైవ్ చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కృష్ణదాస్
- నరసన్నపేటలో ట్రాక్టర్లతో ర్యాలీ

నరసన్నపేట: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ప్రతిరైతుకూ అన్నివిధాలా భరోసా ఇస్తూ వ్యవసాయం దండగ కాదు పండుగలా రైతులు చేసుకునేలా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. విత్తనాల నుంచి పండిన పంట అమ్ముకునే వరకూ అన్నిస్థాయిల్లో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సబ్సిడీపై మంజూరైన యంత్ర పరికరాలు, ట్రాక్టర్లను రైతులకు ఎమ్మెల్యే శుక్రవారం అందించారు. అనంతరం వైఎస్సార్ కూడలి వద్ద ట్రాక్టర్ల ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ట్రాక్టర్‌ను డ్రైవింగ్ చేసి ఉత్సాహ పరిచారు. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చినప్పటి నుంచి రైతులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు అవసరమైన అన్ని పరికరాలు సబ్సిడీపై అందిస్తున్నట్టు వెల్లడించారు.

ఈ ఒక్క సంవత్సరంలోనే నరసన్నపేట నియోజకవర్గంలో రూ. 16 కోట్ల విలువైన యంత్ర పరికరాలు రైతులకు అందించడం జరిగిందన్నారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతు సంఘాలను ఏర్పాటు చేసి వారికి సబ్సిడీపై యంత్ర పరికరాలు అందిస్తున్నామన్నారు. వీటిని రైతులు సక్రమంగా వినియోగించుకుని ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని కోరారు. రానున్న ఖరీఫ్ సీజనలో రైతులకు ఎరువులు, విత్తనాలు సక్రమంగా అందించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అన్ని ఆర్‌బీకేల్లో ఎరువులను నిల్వ చేయాలని జేడీ కె.శ్రీధర్‌కు సూచించారు. వైఎస్సార్ కూడలి నుంచి పల్లిపేట కూడలి వరకూ ట్రాక్టర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుంపల భాస్కరరావు, పార్టీ నాయకులు చింతు రామారావు, ముద్దాడ బైరాగి నాయుడు, పొన్నాన దాలినాయుడు, కేసీహెచ్‌బీ గుప్త, ధర్మాన జగన్, రాజాపు అప్పన్న, తంగి మురళీ కృష్ణ, పాగోటి రాజారావు, వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి, ఏవోలు కె.సునీత, చిరంజీవులు, వెంకటరావు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఇంటింటా సంక్షేమ చేరువైందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులు పొందిన ఆర్థిక ప్రయోజనాలు కోసం అవగాహన కలిగించారు. ఏమైనా సమస్యలు ఉన్నా, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోయినా తనకు తెలియజేయాలని కోరారు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు పరిపాలన, గ్రామ వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు అందించే ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. కుల, మత, ప్రాంత, వర్గ, రాజకీయ భేదం లేకుండా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి మాటల్లో చెప్పామంటే చేతల్లో చేస్తామని నిరూపించిన ఘనం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. 600 హామీలిచ్చి ఆరు కూడా నెరవేర్చలేని చంద్రబాబు, టీడీపీ నాయకులు జగన్‌ను చూసి భయపడుతున్నారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తపనతో టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న జగన్‌కు అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, సర్పంచ్ ముగడ దివాకర్, ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, నాయకులు ముగడ జనార్దన, లుకలాపు సుధీర్, ఈగల చిన్నారావు, తొత్తడి మురళీకృష్ణ, రెడ్డి సీతారాం, అశోక్ పాణిగ్రహి, రామ్‌నాథ్ మహాపాత్రో, రెడ్డి లక్ష్మణరావు, ఈఓపీఆర్డీ జి.శ్యామలాదేవి, ఉపాధి ఏపీవో వి.శ్రీదేవి పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన ఏర్పాట్లు



భోజనం చేస్తున్న గర్భిణులు

ఆమదాలవలస రూరల్: అక్కులపేట సత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బొడ్డేపల్లి వసంత, కూన మీనాకుమారి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు శుక్రవారం మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, వారి బంధువులకు ప్రతి నెల తొమ్మిదో తేదీన పీహెచ్‌సీలో గర్భిణలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వచ్చే గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు ఏడేళ్లగా అంతరాయం లేకుండా భోజనం అందిస్తుండడంతో ఆనందాయకమన్నారు. ఈ నెల ఆమదాలవలసకు చెందిన నంబారి కృష్ణ దంపతులు పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, యూత్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన కృష్ణచైతన్య



విజయసాయిరెడ్డితో కృష్ణచైతన్య

నరసన్నపేట: రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డిని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణ చైతన్య శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సెల్ సమావేశం జరిగిన సందర్భంగా విజయసాయిరెడ్డిని కలవగా.. నరసన్నపేటలో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని, జిల్లాతో పాటు ఉత్తరాంధ్రా జిల్లాల్లో బీసీ సెల్‌ను పటిష్టం చేయాలని సూచించినట్లు కృష్ణ చైతన్య తెలిపారు.

చిట్టివలసలో పల్లెబాట



గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహిస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. చిట్టివలస గ్రామంలో పల్లెబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మహిళల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆసరా, చేయూత, అమ్మఒడి, ఇళ్ల పట్టాల మంజూరు, గృహ నిర్మాణాలు, స్వయంశక్తి సంఘాల రుణమాఫీలు వంటివి అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి దొంగ మ్యానిఫెస్టోలతో టీడీపీ నాయకులు వస్తే గతంలో ప్రజలకు ఏమి చేశారో ప్రశ్నించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీని అందరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బమ్మిడి అచ్యుతరావు, గురుగుబెల్లి నీలారావు, రౌతు శ్రీనివాసరావు ఉన్నారు.

సంక్షిప్తంగా..

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మెళియాపుట్టి: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చాపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ హేమంతలక్ష్మి అన్నారు. పీహెచ్‌సీలో 46 మంది గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

సారవకోట: తొగిరి యోగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా కల్యాణం జరిపారు. పురోహితుడు రామనుజాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

హిరమండలం: ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 84 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 21 మందికి అత్యవసర వైద్యసేవలు అవసరమని గుర్తించారు. ప్రసూతీ వైద్యనిపుణులు మాధవి, స్పందన వైద్య పరీక్షలు చేశారు. వారికి అవసరమైన ఇంజక్షన్లు చేశారు. విధిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిగీత సూచించారు. స్థానిక సత్యసాయి సేవా సమితి వారు భోజన ఏర్పాట్లు చేశారు. వైద్యులు ఫరూక్ హుస్సేన్, సీహెచ్‌వో నారాయణరావు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం అక్రమ నిల్వపై కేసు నమోదు

కొత్తూరు: మెట్టూరు బిట్-2 ఆర్ఆర్ కాలనీలో ఈ నెల 8 తేదీన తంగుడు గురుమూర్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 700 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. సీఎస్‌డీటీ రవికుమార్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురుమూర్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురపాక గోవింద తెలిపారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఎల్.ఎన్.పేట: తురకపేట గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. బుధవారం రాత్రి వేసిన గాలుల కారణంగా తురకపేట సెంటర్ నుంచి గ్రామానికి వెళ్లే కిలోమీటరు దూరం స్తంభాలు నేలకొరిగి పోవడంతో సరఫరా నిలిచిపోయింది. సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి ఏఈ వెంకటేశ్వర్లు దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో శుక్రవారం పునరుద్ధరణ పనులు చేపట్టారు.

విత్తనాల కొరత లేకుండా చర్యలు

హిరమండలం: ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర రసాయనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గోళ్ల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయలంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఏవో బి.సంధ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు.

ఆర్‌బీకేల సేవలను పటిష్టం చేయాలని తీర్మానించారు. తహసీల్దార్ బి.మురళీమోహన్, ఎంపీడీవో బి.శైలజా, సభ్యులు పాగిరి శ్రీరాములు, తోణంగి తవుడు, బుడి ఆదినారాయణ పాల్గొన్నారు.

బిందుశ్రీకి 45వ ర్యాంకు



బిందుశ్రీ సాహు

సారవకోట: సారవకోట మండల కేంద్రానికి చెందిన బిందుశ్రీ సాహు ఏపీ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలో 45వ ర్యాంకు సాధించింది. ఈమె స్థానికగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో టెన్త్ చదివింది. అలాగే ఇదే గ్రామానికి చెందిన వైద్యభూషణ జ్ఞానరూపేష్ శర్మ 391వ ర్యాంకు సాధించాడు.

వెంకటసాయికి 54వ ర్యాంకు



కొరాడ వెంకటసాయి

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రాలనికి చెందిన కొరాడ వెంకటసాయి ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఓపెన్ కేటగిరీలో 54వ ర్యాంకు సాధించాడు. తండ్రి నాగేశ్వరరావు, తల్లి నిర్లల వ్యవసాయం చేస్తారు. పాతపట్నంలోని ఓ ప్రవేట్ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. ప్రిన్సిపాల్ శ్రీధర్ పటాన్నయక్, కరస్పాండెంట్ డి.గంగధర్‌లు వెంకటసాయిని అభినందించారు.

'జనని'కి 331వ ర్యాంకు



అరసవల్లి జనని

ఆమదాలవలస: ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలో పట్టణంలోని భవిత హైస్కూల్‌కు చెందిన అరసవల్లి జనని రాష్ట్ర స్థాయిలో 331వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. జననిని పాఠశాల కరస్పాండెంట్ ఎస్.మురళీధర రావు, డైరెక్టర్ సువ్వారి సునీత, హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రోజాకు 298వ ర్యాంకు



రోజా

సరుబుజ్జిలి: రొట్టవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గేదెల రోజారమణి 108 మార్కులతో రాష్ట్రస్థాయిలో 298వ ర్యాంకు సాధించినది. టెన్త్ పరీక్షల్లో కూడా 573 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. పాలిసెట్‌లో కూడా 97 మార్కులతో 1239వ ర్యాంకు సాధించింది. రోజాను పాఠశాల హెచ్ఎం ఎస్. రామకృష్ణ, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

యోగాపై అవగాహన

హిరమండలం: గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి కె.ఎర్రమ్మ అన్నారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు విద్యతో పాటు యోగాపై, విశ్రాంతి ఉద్యోగి శ్రీనివాసరావు ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన కల్పించారు.

11న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పాతపట్నం: పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి సంబంధించి ఈ నెల 11వ తేదీ ఉదయం పది గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డిపార్ట్‌మెంట్ అధికారి బుగత అనిల్‌కుమార్ తెలిపారు. పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచామన్నారు. పరీక్షకు 30 నిమిషాలు ముందుగా కేటాయించిన కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో 169 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉందన్నారు.

పొందూరు: వావిలపల్లిపేట మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి 11వ తేదీన పరీక్ష జరుగుతోందని ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ తెలిపారు.

జేవీకే కిట్ల పంపిణీపై సమీక్ష

హిరమండలం: విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యాకానుక కిట్లు అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఎంఈవో రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్పీలు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు.

సీఎం జగన్‌తోనే పారదర్శక పాలన



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కృష్ణదాస్

సారవకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బద్రి సచివాలయ పరిధిలోని బద్రి, ఉప్పరపేట, గోపినాథపురం గ్రామాల్లో ఎంపీటీసీ సభ్యుడు మెండ బాలచంద్రరావు నాయుడు ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ దూరదృష్టితో ఆలోచన చేసి విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. పేదవారికి సహితం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. కొన్నేళ్ల క్రితం మంజూరైన ఇంటికి ఆర్థిక పరిస్థితి బాగోలేక పని చేసుకోలేక పోయానని అంకమ్మ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వెంటనే స్పందించిన ఆయన ఐదు వేల రూపాయలను ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, తహసీల్దార్ హనుమంతరావు, ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఈఓపీఆర్డీ రేణుక, పంచాయతీ కార్యదర్శి మురళీ వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు భాస్కరరావు, బాడాన కృష్ణారావు, గోవిందరావు, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, నాయకులు, నక్క తులసీదాస్, రావాడ శ్రీనివాసరావు, కాళ్ల సింహాచలం, పొన్నాన వైకుంఠరావు, హరిప్రసాద్, మోహనరావు, మామిడి కాంతారావు ఉన్నారు.

వరి విత్తనాల పరిశీలన



విత్తనాల నమూనాలు సేకరిస్తున్న శ్రీనివాసరావు

కొత్తూరు: మండల కేంద్రంలోని మన గ్రోమెర్ కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పలు కంపెనీలకు చెందిన హైబ్రీడ్ వరి విత్తనాల నమూనాలను కొత్తూరు మండలం ఏవో శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేకరించిన విత్తనాలను పలు రకాల పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెంలోని రీజనల్ రీకోడింగ్ సెంటర్‌కు పంపిస్తున్నట్లు చెప్పారు. విత్తనాల మొలక శాతం, భౌతిక స్వచ్ఛత, తేమ వంటి పరీక్షలు చేసినప్పుడు ప్రమాణాలకు తగ్గట్టుగా లేకపోతే విత్తన చట్టం ప్రకారం ఆయా కంపెనీలపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి బూడిత రమేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు దివాఖర్, షణ్ముఖలు ఉన్నారు.